క్లుప్తంగా

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



గునుగల్‌లో సర్వే చేస్తున్న అధికారులు

యాచారం: సంక్షేమ పథకాల అర్హుల కోసం అధికారులు ఇంటింటి సర్వే ముమ్మరం చేశారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో మండల పరిధి నుంచి 4 వేలకు పైగానే ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. వాటి నిర్ధారణ కోసం సోమవారం గునుగల్‌లో అధికారులు ఇంటింటి సర్వే చేశారు. అర్జీ దారుల వివరాలను సేకరించారు. ఇందులో మాజీ వైస్ ఎంపీపీ కె. శ్రీనువాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన



ఓటర్ జాబితా ప్రదర్శించిన ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తదితరులు

యాచారం: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి పలు గ్రామాల్లో అధికారులు ఓటర్ జాబితాను ప్రదర్శించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి మండల జాబితాను ప్రదర్శనకు పెట్టగా, ప్రత్యేక అధికారులు వారివారి గ్రామాల్లో లిస్టును ప్రదర్శించారు. ఎమైనా అభ్యంతరాలుంటే తెలపాలని సూచించారు.

రైతు కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: రైతు సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అన్నారు. 2020లో సంఘం సభ్యుడైన పిగ్లీపూర్ గ్రామానికి దుర్గం మల్లయ్య మృతి చెందారు. ఈ మేరకు మృతుడి భార్య బాలమ్మకు సంఘం తరపున రూ.15 వేల ఆర్థికసాయం చైర్మన్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ మొగుళ్ల యాదిరెడ్డి, అకౌంటెంట్ రాకేశ్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి

ఎంపీడీఓ బాలశంకర్



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలశంకర్ తదితరులు

మంచాల: గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని కాగజ్‌ఘట్ గ్రామంలో మన గ్రామం- మన నర్సరీని ఆమె సందర్శించి మాట్లాడారు. వర్షాల సీజన్‌లో మొక్కలు నాటే సమయానికి గ్రామాల్లో సరిపడా మొక్కలు అందుబాటులో ఉంచాలని సూచించారు. వేసవిలో ఎండలు ముదిరే అవకాశం ఉందని, జాగ్రతగా మొక్కలను కాపాడుకోవాలని చెప్పారు. నీడ నిచ్చే నెట్‌లను వాడాలని పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం వేళలో మొక్కలకు నీరు అందించి, అవి చనిపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం



శంకర్‌నాయక్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు ఖాదర్, అలీం, కరీం, కృష్ణనాయక్, మహేశ్, శేఖర్‌గౌడ్, రహీం, అంజద్, రఫీ, శివ, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

- జ్ఞాన సరస్వతికి హంపి పీఠాధితాపతి ప్రత్యేక పూజలు
- చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన విద్యారణ్య భారతి



జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న హోమం

ఆమనగల్లు/యాచారం: వసంత పంచమి వేడుకలు సోమవారం నందివనపర్తిలో ఘనంగా జరిగాయి. రాష్ట్రంలో ప్రముఖ ఆలయంగా గుర్తింపు పొందిన శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో ఉదయం నుంచి పూజారి రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హంపీ పీఠాధితాపతి విద్యారణ్య భారతి స్వామిజీ అమ్మవారి మూలవిరాట్‌కు పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అక్షరాభ్యాసం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 500 మందికి పైగా చిన్నారులతో వారి తల్లితండ్రులు రాగా.. వారికి ఉచితంగా పలక, బలపంతో పాటు పూజ సామగ్రిని నిర్వాహకులు అందజేశారు. అనంతరం చిన్నారులతో స్వామివారు అక్షరభ్యాసం చేయించారు. తన వడిలో కూర్చోబెట్టుకుని ఓనమాలు దిద్దించారు. సరస్వతి హోమం నిర్వహించారు.

పుణ్యక్షేత్రంగా నందివనపర్తి

భవిష్యత్‌లో నందివనపర్తి గ్రామం గొప్ప పుణ్యక్షేత్రంగా మారబోతుందని, ఆ శక్తిని జ్ఞాన సరస్వతి అమ్మవారే కల్పిస్తుందని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ అన్నారు. వసంత పంచమి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. బాసర తరహాలో ఆలయం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఇందుకు నిదర్శనం వేలాదిగా భక్తులు తరలిరావడమేని పేర్కొన్నారు. ప్రజల్లో దైవభక్తి ఉండాలని, అది ఉన్న చోట ప్రజలు సంతోషంగా ఉంటారని, పాడి పంటలతో పల్లెలు కళకళలాడతాయని వెల్లడించారు. ధర్మాన్ని కాపాడితే భవిష్యత్తులో ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి, సభ్యులు రాఘవేంద్రశర్మ, రామనాథం, జోగిరెడ్డి, నిఖిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నయనాచారి ఆధ్వర్యలో సరస్వతిపూజ, హోమం చేశారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు



ఆమనగల్లులో అక్షరాభ్యాసం

పాపిశెట్టి రాము, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సలహాదారులు నారాయణగౌడ్, మాజీ అధ్యక్షుడు విశ్వనాదం, ఎస్ఐ యాదయ్య, కానిస్టేబుల్ మల్లేశ్, స్థానికులు ప్రవీణ్, అంజయ్య, మాతాజీలు కవిత, అనూష, భగవతి, స్వాతి పాల్గొన్నారు.

ప్రతి పైసా ప్రజాసంక్షేమానికే..

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

మాడ్గుల: గత ప్రభుత్వం పాటించిన ఆర్థిక విధానాలతో రాష్ట్రం దివాలా తీసిందని, అయినా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచ కిట్లను అందజేసి మాట్లాడారు. ఆడంబరాలకు పోకుండా ప్రతిపైసా ప్రజలకోసం ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి ప్రాణాలు కోల్పోవడమో, అంగవైకల్యం బారిన పడటమో జరుతుందని, అలాంటి ప్రమాదాలు జరగకుండా, కార్మికులకు కాటమయ్య కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. గీత కార్మికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో భారీగా ఈత చెట్లను పెంచే అంశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ పద్మారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండుగౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ జగన్ గౌడ్, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



పార్టీలో చేరిన వారితో జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి చంద్రాయణపల్లితండాలో సోమవారం బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు పార్టీలో చేరగా.. గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ.. అమలుకాని హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసంచేసి గద్దె నెక్కిందని, దీంతో ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికలలో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పనున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రజా సంక్షేమం కోసం ఎక్కడా లేనివిధంగా అనేక పథకాలు అమలు చేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అనురాధ, బీఆర్‌ఎస్ నాయకులు నిరంజన్‌గౌడ్, ఎంగలి రఘు, గుత్తి బాలస్వామి, వడ్డె వెంకటేశ్, గణేశ్, దోనాదుల కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణే సమితి లక్ష్యం



యాచారం: డప్పులతో ప్రచారం చేస్తున్న సమితి నాయకులు

- మహాసభకు తరలిరండి
- ఎమ్మార్పీఎస్ నేతల ప్రచారం

యాచారం: ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణ సాధనే 'వేయి గొంతులు-లక్ష డప్పుల' లక్ష్యమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సమితి శ్రేణులు డప్పులతో ప్రచారం చేశారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో సమితి నిర్వహించే మహాసభకు మాదిగ, మాదిగ ఉపకులాలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి మండల అధ్యక్షుడు మాలి మహేశ్, నాయకులు ముత్యాలు, జోగు కృష్ణ, జోగు అంజయ్య, చింతుల్ల సాయిలు, తోట్ల బాల్‌రాజ్, కొంగరి జంగయ్య, వంశీ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

ఆమనగల్లు: మండల పరిధి కోనాపూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు కంబాలపల్లి రవి సమితి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 7న నగరంలో నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి నాయకులు రవి, మహేందర్, నిరంజన్, జంగయ్య, శ్రీశైలం, వీరేశ్, రమేశ్, కుమార్ పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభం

ఆమనగల్లు: మండల పరిధి మేడిగడ్డతండాలో నూతనంగా వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులను సోమవారం మాజీ ఎంపీపీ అనిత ప్రారంభించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.7 లక్షలతో పనులు చేపట్టామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ వినోద, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ శరత్, స్థానిక నాయకులు విజయ్‌రాథోడ్, పరమేశ్, రాంజ్యానాయక్, గేమ్య, పాండు, మాల్య, శ్యాం, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు నేతలు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 వరకు నోటిఫికేషన్ వస్తే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీచేసే వారు తగు ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. పార్టీ శ్రేణులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇందులో నాయకులు భాస్కర్‌రెడ్డి, నర్సింహ ఉన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరుడి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తరలివచ్చిన భక్తజనం

ఆమనగల్లు: శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉత్సవం సందర్భంగా శెట్టిపల్లి గ్రామంలోని ఆలయం, కల్యాణ మండపాన్ని పచ్చని తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అర్చకులు గూడ కృష్ణమాచార్యులు, రాధాకృష్ణశర్మ, అనిల్‌జోషి, నిహాల్ జోషిల నేతృత్వంలో.. మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, ఆలయ కమిటీ చైర్మన్ సింగిని శ్రీనివాస్, మాధవి, ట్రస్టి కోట్ల జగన్‌మోహన్, సంధ్య, పాలమూరు నెహ్రూబాబు, వాసవీ, కేశరాములు, స్వరూప దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. ఉత్సవంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు స్వామి వారికి తలంబ్రాలను తీసుకువచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో ఓటర్ జాబితాపై సమావేశం

కందుకూరు: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో సప్లిమెంటరీ ఓటరు జాబితా తయారు చేశామని, ఆ లిస్టులో అభ్యంతరాలపై మంగళవారం మధ్యాహ్నం వివిధ పార్టీల నాయకులతో సమావేశంఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ సరిత సోమ వారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు రాజకీయ పార్టీల నాయకులు హాజరై ఓటరు లిస్టుపై అభ్యంతరాలను తెలియజేయాలని ఆమె కోరారు.

క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత

ఫోర్త్‌సిటీలో అధునాతన స్టేడియం నిర్మించనున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి శెట్టిపల్లి గ్రామంలో సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి ఓపెన్‌టూ ఆల్ వాలీబాల్ టోర్నీని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, యువతను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించిందని తెలిపారు. ఫోర్త్ సిటీలో అధునాతన స్టేడియం నిర్మించేందుకు సిద్ధంగా చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ గోదాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముఖద్వారం ప్రారంభం

కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ ముఖద్వారాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి ప్రారంభించారు. ముఖద్వారాన్ని యాట పార్వతమ్మ, జంగయ్య, ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ యాట గీత, నర్సింహలు కలిసి రూ.28 లక్షలతో నిర్మించారు. ఈ సందర్భంగా దాతలను ఆయన సత్కరించారు. ఆలయ ధర్మకర్త రామానుజాచార్యులు, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఎంపీటీసీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్



మాట్లాడుతున్న నాయకులు

కేశంపేట: గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల్లోనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు సుమారు 7కోట్ల నిధులను మంజూరు చేయించారన్నారు. గ్రామాల్లో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ఈ నిధులను మంజూరు చేయించారని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామని ఆయన తెలపారు. రానున్న నాలుగేళ్లలోగా గ్రామాలు అభివృద్ధి పథంలో కొనసాగుతాయని హామీనిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన తెలిపారు. మండల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నాగిళ్ల భాస్కర్, సురేశ్‌రెడ్డి, బీస కరుణాకర్‌రెడ్డి, గిరియాదవ్, రావుల పెంటయ్య, గ్యార సురేష్, తుమ్మల గోపాల్, కోడూరు రాములు, భీమయ్య, రూప్లా నాయక్, హరీశ్వర్‌రెడ్డి, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


దురుసుతనం మంచిదికాదు

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెనగారి లక్ష్మారెడ్డిపై దురుసుగా మాట్లాడటం ఎమ్మెల్యే సబితారెడ్డికి తగదని బడంగ్‌పేట కంటెస్టెడ్ కార్పొరేటర్, 24వ డివిజన్ ఇన్‌చార్జి నవారు మల్లారెడ్డి అన్నారు. సోమవారం అల్మాస్‌గూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యేను విమర్శించే హక్కు సబితారెడ్డికి లేదన్నారు. ఎవరు నిధులు తెచ్చినా డివిజన్ల అభివృద్ధికే అనే సంగతి మరిచి ఆమె మాట్లాడుతున్నారని విమర్శించారు. జీవోల పేరుతో కాలనీవాసులను మోసం చేశారన్నారు. ఐదు సంవత్సరాలు మంత్రిగా ఉండి ఎంత అభివృద్ధి చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ అస్తవ్యస్తం ప్రమాదాలు నిత్యకృత్యం!

జల్‌పల్లి మున్సిపాలిటీలో పేరుకుపోయిన కరెంటు సమస్యలు

- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో స్థానిక ప్రజలు



ఎర్రకుంటలో పిట్టగూళ్లను తలపిస్తున్న విద్యుత్ వైర్లు



వాదే-సాల్హె-హీన్ బస్తీలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న విద్యుత్ సమస్యలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వైర్లు, టీవీ కేబుల్స్ ఒకే స్తంభానికి పిట్టగూళ్లను తలపించేలా కలిసి ఉండడం.. చిన్నారులు అందుకునే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు.. ఇళ్ల బాల్కానీల పక్క నుంచే చేతికందే దూరంలో కరెంటు తీగలు ఉండటంతో ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. గత నెల షాహీన్‌నగర్ ప్రధాన రహదారిపై నిర్మాణంలో ఉన్న ఇంటి బాల్కనీలో పీఓపీ పనులు చేస్తుండగా ఓ కార్మికుడు పట్టుతప్పి వైర్లపై పడి, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్తంభాలు ఒకదానికొకటి దూరంగా ఉంటుండడంతో తీగలు సాగి వేలాడుతున్నాయి. చిన్నపాటి గాలులకే తెగిపోతున్నాయి. ప్రతినెలా క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తున్నా, సంబంధిత అధికారులు మాత్రం ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం లేదని మండిపడుతున్నారు.

దశాబ్దం కావొస్తున్నా..

జల్‌పల్లి, పహాడీషరీఫ్, బాలాపూర్, కొత్తపేట నాలుగు గ్రామ పంచాయతీలతో కలిపి 2016లో జల్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పడింది. దాదాపు దశాబ్దం కావొస్తున్నా ఇక్కడి విద్యుత్ వ్యవస్థలో మార్పులు రావడం లేదు. పంచాయతీగా ఉన్న సమయంలో ఆవాసాలు తక్కువగా ఉండటంతో ఇందుకు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ఇళ్లతో పాటు జనాభా భారీగా పెరిగింది. దీనికి అనుగుణంగా విద్యుత్ వ్యవస్థలో మార్పులు చేయట్లేదు. ఉన్న దాంట్లోనే సర్దుబాటు చేస్తుండటంతో తరచూ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకే స్తంభానికి రెండు వరుసల్లో వైర్లు తీసుకెళ్తుండడం, సింగిల్ స్తంభానికి కాసారాలు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తుండటం పరిపాటిగా మారింది.

తరచూ కోత.. తీరని వ్యథ

మున్సిపల్ పరిధిలో వారానికి మూడు నాలుగు రోజులు చెట్ల కొమ్మల కత్తిరింపు, ఇతర మరమ్మతుల పేరిట అధికారికంగా విద్యుత్ కోత విధిస్తున్నారు. పనుల అనంతరమైనా నాణ్యమైన కరెంటు సరఫరా చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. షాహీన్‌నగర్ సమీపంలోని క్యూబా కాలనీలో విద్యుత్ కోతలపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని చెబుతున్నారు.

ప్రాణాలు పోతున్నా..

అల్లైన్ కాలనీలో ఇళ్లను ఆనుకొని ఉన్న విద్యుత్ వైర్ల కారణంగా ఇప్పటివరకు ముగ్గురు మృతి చెందారు. 2014లో కాలనీకి చెందిన రిజ్వానా బేగం ఇంట్లో అద్దెకు ఉన్న ఓ 18 ఏళ్ల యువతి బాల్కనీలో దుస్తులు ఆరేస్తూ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురైంది. ఆమెను రక్షించేందుకు వెళ్లిన 30 ఏళ్ల సోదరుడు కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అంతకుముందు ఇదే కాలనీలో నూతన ఇంటి పనులు చేస్తున్న మేస్త్రీ బాల్కనీలోని వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.

అధికారులు స్పందించాలి



ఎన్నో ఏళ్ల క్రితం వేసిన లైన్లనే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. స్తంభాల నడుమ కూడా దూరం పెరిగి తీగలు ఇళ్లపై వేలాడుతున్నాయి. ఈ విషయంలో అధికారులు స్పందించి కొత్త లైన్లు వేయడంతో పాటు స్తంభాల సంఖ్యను కూడా పెంచాలి. చిన్న పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా ట్రాన్స్‌ఫార్మర్లకు దిమ్మెలు కట్టాలి.

– షర్ఫుద్దీన్ హామెద్, షాహీన్‌నగర్